క్లుప్తంగా

'మైనర్లు వాహనాలు నడపొద్దు'



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ మహేందర్

నిర్మల్‌టౌన్: మైనర్లు వాహనాలు నడపొద్దని, ఎవరైనా నడిపితే వారి తల్లిదండ్రులకు శిక్ష తప్పదని నిర్మల్ ఎంవీఐ మహేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఆర్టీఏ సిబ్బంది పాల్గొన్నారు.

డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వ్యాప్తంగా రాజీవ్ ఆరోగ్యశ్రీలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి వేతనాలు పెంచాలని నిర్మల్ ఆరోగ్యశ్రీ యూనియన్ సభ్యులు నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఉద్యోగులకు నేరుగా ట్రస్ట్ ద్వారా జీవో నెంబర్ 60 ప్రకారం రూ.22,740 వేతనం చెల్లించాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఉన్న ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని కోరారు. నిర్మల్ ఆరోగ్యశ్రీ యూనియన్ సభ్యులు స్వప్న, విజయలక్ష్మి, కల్పన, అశ్విని, రేఖ, ముకేష్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కుంటాల: వృద్ధుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని నిర్మల్ ఏరియా ఆసుపత్రి యునాని వైద్యురాలు అంతర్ ఫాతిమా పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల యునాని వైద్యశాలలో ఆరోగ్య మందిర్ (ఆయుష్ శాఖ) ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మాట్లాడారు. వృద్ధులకు ఆయుర్వేదం, యోగ, ప్రకృతి చికిత్స, యునాని, సిద్ధ, హోమియోపతి సంప్రదాయ పద్ధతుల్లో వైద్యం అందిస్తామన్నారు.డీపీఎం శ్రావణ్ కుమార్, సిబ్బంది శివమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడి సైకిల్‌యాత్ర

భైంసాటౌన్: ఎమ్మెల్యే రామారావు పటేల్ సోదరుడు దత్తాత్రేయ పవార్ శుక్రవారం బాసరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రామారావు పటేల్ గెలిచిన నేపథ్యంలో మొక్కులో భాగంగా భైంసాలోని ఎమ్మెల్యే నివాసం నుంచి బాసర అమ్మవారి ఆలయం వరకు సైకిల్‌యాత్ర చేపట్టారు. అనంతరం బీజేపీ కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. నాయకులు సతీశ్ రెడ్డి, కోరి పోతన్న, గంటా శ్రీనివాస్, అనిల్, లక్ష్మారెడ్డి, నవీన్ తదితరులు ఉన్నారు.

ఓటర్ లిస్ట్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముధోల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఓటరు లిస్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల ఎంపీడీవోలు, కార్యాలయాల సిబ్బంది హాజరయ్యారు. రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఓటర్ల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సుదర్శన్, డీపీవో శ్రీనివాస్, ఆయా మండలాల ఎంపీడీవోలు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

తపాలా శాఖ బీమా పథకాలపై అవగాహన

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామంలో తపాలా శాఖ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పథకంలో భాగంగా తపాలా శాఖ బీమా సేవలపై ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తపాల శాఖ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ దిలీప్‌కుమార్, భైంసా మెయిల్ ఓవర్సీస్ నరేశ్‌కుమార్, పవన్, బీపీఎంలు దేవన్న, అభిరాం, మాజీ సర్పంచ్ నరేశ్ ఉన్నారు.

లక్ష్మణచాంద: గ్రామీణ ప్రాంత ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ పేర్కొన్నారు. శుక్రవారం వడ్యాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



నిర్మల్‌టౌన్: గండి రామన్న ఆలయం వద్ద పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



భైంసారూరల్: నాగదేవత ఆలయం వద్ద క్యూలైన్‌లో భక్తులు



ఖానాపూర్: పుట్ట వద్ద బారులుదీరిన భక్తులు



బాసర: పూజలు నిర్వహిస్తున్న మహిళలు

జిల్లావ్యాప్తంగా భక్తులు నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు ఆలయాలు, పుట్ట వద్దకు చేరుకొని పూజలు చేశారు. ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మహిళలు పాముల పుట్టలో పాలుపోసి పుట్నాలు, పేలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇళ్లల్లో సోదరుల కళ్లను పాలతో కడిగి సోదరీమణులు ఆశీర్వదించగా, సోదరులు తమకు తోచిన కానుకలు సమర్పించుకున్నారు. భైంసా రూరల్ మండలంలోని సుంక్లి, మాంజ్రి గ్రామ సమీపంలోని నాగదేవత ఆలయాల్లో ఎమ్మెల్యే రామారావు పటేల్ పూజలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



లోకేశ్వరం: పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న మహిళలు



కుభీర్‌లో నాగదేవతకు పూజలు చేస్తున్న మహిళలు



ముధోల్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



భైంసారూరల్: మాంజ్రి గ్రామంలో..



కుంటాల: పూజలు చేస్తున్న మహిళలు



దస్తురాబాద్: రాజరాజేశ్వర ఆలయంలో..



లోకేశ్వరం: పూజలు చేస్తున్న మహిళలు

ప్రతీ ఒక్కరు మొక్కలను సంరక్షించాలి

నిర్మల్‌టౌన్: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాలని ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌వో కేవీఎస్ ప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.



నిర్మల్‌టౌన్: మొక్క నాటుతున్న ప్రసాద్ రెడ్డి

తానూరు: ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. శుక్రవారం మండలంలోని దౌలతాబాద్ గ్రామంలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటారు. కోలూరు గ్రామాన్ని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సందర్శించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా వీధులలో పర్యటించి మురికి కాలువలను పరిశీలించారు.

లోకేశ్వరం: ప్రతీ ఒక్కరు ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు, పిప్రి తదితర గ్రామాల్లో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

మామడ: మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీకళ, ఎంపీడీవో గంగాసాగర్ రెడ్డి, ఏపీవో శివాజీ, ఏపీఎం అరుణ, పశువైద్యాధికారి మహేశ్, పంచాయతీ అధికారి మహేందర్ పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: నీటిపారుదల శాఖ జిల్లా ఉద్యోగుల కార్యాలయ ఆవరణలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి మొక్కలు నాటారు. జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మసార్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి, టీఎన్జీవో అధ్యక్షుడు ప్రభాకర్, డీఈఈ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, డీఏవో శరత్, సూపరింటెండెంట్ లు జవాబు హుస్సేన్, మోహన్, శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖానాపూర్: స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని సత్తనపల్లి, సేవ్య నాయక్ తండాలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి బాబురావు, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు హాజరై మొక్కలు నాటారు.

నర్సాపూర్(జి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని మల్లికార్జున మండల మహిళా సమాఖ్య పొదుపు కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. అనంతరం రుణమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం సునంద పాల్గొన్నారు.

సారంగపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం ప్రిన్సిపాల్ శంకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటారు. సిబ్బంది శ్రీనివాస్, పోతన్న తదితరులు ఉన్నారు.

కుంటాల: గ్రామాల అభివృద్ధికి అందరు సహకరించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు.

ఖానాపూర్: ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో గల అటవీశాఖ హరితవనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటా'

భైంసాటౌన్: ముధోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్ ఏజెంట్ మాయమాటలతో మోసపోయి కువైట్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పందించి శుక్రవారం గ్రామస్తులు, బాధితుడి కుటుంబ సభ్యులతో తన నివాసంలో మాట్లాడారు. నాందేవ్‌ను భారత్‌కు రప్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు.



భైంసాటౌన్: బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రామారావు పటేల్

కాలనీ అభివృద్ధికి సహకరించండి


పట్టణంలోని టీఎన్జీవోస్ కాలనీలో సమస్యలు పరిష్కరించి, అభివృద్ధికి సహకరించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే రామారావుపటేల్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కమ్యూనిటీ హాల్ భవనం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షుడు నాగోరావు, మాజీ కార్యదర్శి రమణ, మోయినుద్దీన్, రాజారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే పవార్ రామరావు పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎస్టీ కమ్యూనిటీ హాల్ సీడీపీ రూ. 3లక్షలు, జెడ్పీ ఎస్ఎఫ్‌సీ రూ. 5లక్షలతో నిర్మించిన భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

వేంకటేశ్వరాలయంలో ఎమ్మెల్యే పూజలు

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలోని వేంకటేశ్వరాలయంలో శుక్రవారం బీజేఎల్పీ నేత , ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. ఆలయం వార్షికోత్సవం సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ఆలయ అర్చకులు హోమం నిర్వహించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

కుంటాల: శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని కుంటాలలో ప్రసిద్ధి చెందిన మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం అలంకరణ, అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయన్న, గంగయ్య, రాజు, రమేశ్, గజ్జారాం పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో గల దత్తాత్రేయ స్వామి ఆలయంలో శుక్రవారం కుంకుమార్చన ఘనంగా జరిగింది. శ్రావణ మాసం పురస్కరించుకొని తొలి శ్రావణ శుక్రవారం కావడంతో అర్చకులు రాజశేఖర్‌శాస్త్రి ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

భైంసారూరల్: మండలంలోని ఇలేగాంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని కుమురంభీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణ చేపట్టి నాయక్‌పోడ్‌లకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నాయక్‌పోడ్ సంఘం అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు నరేశ్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్: కుమురంభీం, రాంజీ గోండు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్, ధర్మోర, పంచగుడి, జోహర్‌పూర్, లోకేశ్వరం గ్రామాల్లో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలు ర్యాలీ నిర్వహించారు. కుమురం భీం విగ్రహాలకు నివాళులర్పించారు. ఆదివాసీల సంఘం నాయకులు రాందాస్, హన్మంతు, శంకర్, నారాయణ, జగదీప్, శేఖర్, గంగాధర్, సందీప్, నరేశ్ ఉన్నారు.

నిర్మల్‌టౌన్: ఆదివాసీ బిడ్డలు పోరాట యోధులని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ ప్రాంతంలో గల కుమురం భీమ్, రాంజీ గోండ్ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.

పెంబి: మండల కేంద్రంతో పాటు వేణునగర్, తదితర గ్రామాలలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెండా ఆవిష్కరించి కుమురం భీం, కుమురం సూరు చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆదివాసీ మండల అధ్యక్షుడు భీంరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఉద్యమిస్తేనే హక్కుల సాధన సాధ్యమని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అన్నారు.



పెంబిలో నినాదాలు చేస్తున్న నాయకులు

పట్టణంలోని కుమురం భీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులతో కలిసి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఆదివాసీల హక్కులపై దాడులు జరుగుతున్నాయన్నారు. మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లెడికుంట గ్రామంలో ఆదివాసీలు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంకుష్‌రావు, రాజ్‌కుమార్, లింగు, గణేశ్, దేవరావు, భీంరావు తదితరులు ఉన్నారు.

సారంగపూర్: మండలకేంద్రంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని స్థానిక ఆదివాసీ, నాయక్‌పోడ్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలకేంద్రంలోని



లోకేశ్వరం: నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

బస్టాండ్ ఆవరణలో కుమురంభీం, చాకలిఐలమ్మ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లేష్, ముచ్చిండ్ల భోజన్న, ఎర్రం గంగన్న, రమణ, నర్సయ్య, మారుతి, హాదీ, రాజన్న, గణేశ్, శంకర్, తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: మండలంలోని గోడిసేర్యాల గోండుగూడ, చెన్నూర్, దస్తురాబాద్ గ్రామాలల్లో ఆదివాసీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తుడుందెబ్బ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు మండల తుడుందెబ్బ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు.

డీసీసీ అధ్యక్షుడి పర్యటన



స్వర్ణ ప్రాజెక్టు గేట్లు పరిశీలిస్తున్న శ్రీహరిరావు

సారంగపూర్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పర్యటించారు. అడెల్లి ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన జాదవ్ లక్ష్మణ్ అనే కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించారు. అక్కడి నుంచి స్వర్ణ ప్రాజెక్టుకు చేరుకున్న ఆయన ప్రాజెక్టు గేట్లు, నీటినిలువ సామర్థ్యం, ప్రస్తుత నీటిమట్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సారంగాపూర్‌కు చేరుకుని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, మాజీ ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు రాజ్ మహ్మద్, నాయకులు అబ్దుల్ హాదీ, విలాస్‌రావు, మారుతి, వెంకటరమణారెడ్డి, పోతారెడ్డి, ముత్యంరెడ్డి, సలీమ్, సత్యపాల్‌రెడ్డి, మాధవరావు, రాజ్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తానూరు/నర్సాపూర్(జి)/నిర్మల్‌చైన్‌గేట్/ పెంబి/ లక్ష్మణచాంద/భైంసాటౌన్: జిల్లాలోని తానూరు, నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ, జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్, దివ్యనగర్, పెంబి, లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్, పీచర, భైంసా పట్టణంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత విద్యుత్ అధికారులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

13న బహిరంగ వేలం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపల్ పరిధిలో గల 26 వ్యాపార దుకాణ సముదాయాలకు ఈ నెల 13న బహిరంగ వేలం ఉంటుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయం ముందు గల 9 గదులతో పాటు జీప్ అడ్డాలోని 8 గదులు, ఎన్టీఆర్ చౌరస్తాలో గల పార్కు పక్కనే ఉన్న 9 గదులకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 12వ తేదీ లోపు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రూ.లక్ష డీడీ తీసి కార్యాలయం పనివేళలో అందజేయాలన్నారు.

బడివేళల్లో బస్సు నడపాలి

భైంసాటౌన్: విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయాల్లో బస్సులు నడపాలని కుంటాల మండలంలోని ఓలా, దౌనెల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం భైంసాలో డీఎం హరిప్రసాద్‌ను కలిసి విన్నవించారు.

అనాథలకు ఆర్థిక సాయం

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన తోకల స్రవంతి, స్వప్న అనే అనాథ ఆడపిల్లలకు రాంపూర్ గ్రామస్తులు విరాళాలు సేకరించి శుక్రవారం అందజేశారు. చిన్నతనంలోనే వారి తండ్రి కుటుంబాన్ని వదిలి వెళ్లిపోగా ఇటీవల తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో యువకులు విరాళాలు సేకరించి రూ.45,700 నగదును వారికి అందజేశారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

కడెం: మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎంపీడీవో అరుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఈడీఐఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేవోపీని ప్రారంభించారు.

మొక్కలు నాటిన నాయకులు

కుంటాల: కాంగ్రెస్ యూత్ ఫార్మేషన్ డే సందర్భంగా శుక్రవారం మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. మండల యూత్ అధ్యక్షుడు మహేశ్, గ్రామ అధ్యక్షుడు కమలాకర్, మాజీ ఉప సర్పంచ్ రాజన్న, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామ రేషన్ దుకాణంలో లబ్ధిదారులకు నాసిరకం పీడీఎస్ బియ్యం పంపిణీ చేస్తున్నారని 'సాక్షి'లో 'నాసిరకం బియ్యం పంపిణీ' వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ రమాదేవి శుక్రవారం చాక్‌పల్లి గ్రామ రేషన్ దుకాణంలోని రేషన్ బియ్యాన్ని తనిఖీ చేశారు. బియ్యంలో పురుగులు ఉండడంతో బియ్యం మార్చి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం, పంచాయతీ కార్యదర్శి నరేశ్ కుమార్, డీలర్ ఉన్నారు.



స్టాక్ పరిశీలిస్తున్న డీటీ రమాదేవి